క్లుప్తంగా

శివ పార్వతుల కల్యాణం కమనీయం



కల్యాణ మహోత్సవంలో తాళిని చూపుతున్న వేద పండితులు

వల్లూరు : స్థానిక శ్రీ భవానీ శంకర ఆలయంలో ఆదివారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేద పండితులు ఆధ్వర్యంలో వారి కల్యాణం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకాన్ని, శ్రీచక్ర సహిత భవానీ మాతకు కుంకుమార్చన నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు వల్లూరు శివరాం కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠించిన అయ్యప్పస్వామి విగ్రహం

వేంపల్లె : కడప–పులివెందుల బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మించిన అయ్యప్ప స్వామి దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అర్చకులు శంకరమంచి ప్రసాదు శర్మ, వేద పండితులు విగ్రహాలను ప్రతిష్ఠించారు. వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, కన్వీనర్ చంద్రఓబుల్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకులు

ఎర్రగుంట్ల : పట్టణంలోని వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయంలో అలాగే నిడుజివ్వి గ్రామంలోని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి నివాసంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించి కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యేను సత్కరించారు.

ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు

చాపాడు : మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో ఆదివారం ఘనంగా గ్రామ దేవత గంగమ్మ తల్లి జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో 30 ఏళ్ల తర్వాత గ్రామ ప్రజలందరూ ఏకమై జాతర వైభవంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి హాజరై గంగమ్మ తల్లి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి గంగమ్మకు బోనాలు సమర్పించారు. ప్రతి ఇంటికి పెద్ద ఎత్తున బంధువులు రావటంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

మేదర్లకు శిక్షణ

మైదుకూరు : వెదుర్లతో వివిధ రకాల కళాకృతులు, బుట్టలు తయారు చేయడంలో మేదర వృత్తిదారుల సంక్షేమం, అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మైదుకూరులో శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ప్రభుత్వ సహకారంతో మేదర్లకు శిక్షణ ఇచ్చి జీ–20 సదస్సులో వారి నైపుణ్యాన్ని ప్రదర్శింపజేస్తున్నట్టు సంస్థ ప్రతినిధులు తెలిపారు. రోజుకు 150 మందికి ఫ్లవర్‌వాజ్‌లు, బుట్టలు తయారు చేయడంలో శిక్షణ ఇస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు తమ్మినేని రాఘవేంద్ర, కార్యదర్శి భావనాశి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

13 నుంచి ఆర్బీకేల్లో ఈ-క్రాప్ జాబితా

గోపవరం : రబీలో సాగైన వివిధ పంటలకు సంబంధించి ఈ–క్రాప్ వివరాలను ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించనున్నట్లు మండల ప్రత్యేకాధికారి, బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ తెలిపారు. ఆర్బీకే సిబ్బంది గ్రామసభలు నిర్వహించి ఈ–పంట నమోదు చేసిన రైతుల వివరాలను చదివి వినిపిస్తారని తెలిపారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే స్థానిక వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా రైతులు సాగుచేసిన పంటలకు సంబంధించి ఈ–పంట నమోదు పూర్తైందని తెలిపారు.

17 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటి అర్బన్ : స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం వైద్యులు 17మంది రోగులకు కంటి ఆపరేషన్లు నిర్వహించారు. కంటి ఆసుపత్రిలో నిర్వహించిన వైద్యశిబిరానికి అన్నమయ్యతో పాటు సత్యసాయి జిల్లాలోని పలు నియోజకవర్గాల నుండి సుమారు 50మంది కంటిరోగులు విచ్చేశారు. కంటి వైద్యుడు సురేష్ ఆధ్వర్యంలో వైద్య బృందం 50 మందికి పైగా రోగులకు కంటిపరీక్షలు నిర్వహించింది.

వైఎస్సార్ సీపీ ఆవిర్భావమే ఒక చరిత్ర

వైఎస్సార్ సీపీ ఆవిర్భావదినోత్సవంలో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



కమలాపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



పులివెందులలో పార్టీ జెండాను ఎగుర వేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాదు, తదితరులు

కమలాపురం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవమే ఒక చరిత్ర అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలతో కలసి పాలాభిషేకం నిర్వహించి మాట్లాడారు. ప్రజల కష్టాలు తొలగించి వారికి మంచి సేవలు అందించాలన్న దృఢ సంకల్పంతో వైఎస్సార్ సీపీని స్థాపించారని, ఆ పార్టీ ఆవిర్భావమే ఒక చరిత్ర అని అన్నారు. 12 పూర్తి చేసుకుని 13వ వసంతంలోకి అడుగుపెడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఎన్ని కష్టాలు, ఒడిదడుకులు వచ్చినా మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగారన్నారు. చిన్న వయస్సులోనే పెద్దపార్టీగా నిలిచిందన్నారు. పార్టీ వెంట ఉన్న కార్యకర్తలు, నాయకులకు కృతజ్ఞతలన్నారు. వైఎస్సార్ సీపీని ప్రజలు రాజకీయ పార్టీగా భావించలేదని, తన కుటుంబ పార్టీగా భావించారన్నారు. అందుకే 51 శాతం ఓట్లు, 151 సీట్లతో చరిత్ర సృష్టించారన్నారను. మెనిఫెస్టోలను అధికారంలోకి వచ్చాక పార్టీలన్నీ చెత్తబుట్టలో పడేస్తారని, కానీ సీఎం మెనిఫెస్టోను ఖురాన్, భగవద్గీత, బైబిల్‌గా భావించి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. ఎలాంటి అనుభవం లేక పోయినా సీఎం వైఎస్ జగన్‌కు చిత్తశుద్ధి ఉందన్నారు. అందుకే కరోనా కష్టకాలంలో సైతం ప్రజలెవరూ ఇబ్బందులు పడకుండా సంక్షేమ పథకాలన్నీ కొనసాగించారన్నారు. 13లక్షల కోటతో పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని, మరో ఐదారేళ్లలో అవన్నీ గ్రౌండింగ్ అవుతాయన్నారు. అపుడు ప్రతిపక్షాలన్నీ నోరెళ్లబెట్టుకోవాల్సిందేనన్నారు. 2024లో కూడా జగన్‌ను సీఎం చేసుకోవడానికి ప్రజలు ఎదురు చూస్తున్నారని, 175కు 175 సీట్లు రావడం తథ్యం అన్నారు. సీకే దిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి రాజకీయ ప్రస్థానమే ఒక చరిత్ర అన్నారు. 2011లో పార్టీ ప్రారంభించి ఎంపీగా పోటీ చేసి 5.45 లక్షల మెజార్టీతో గెలిచి చరిత్ర సృష్టించారన్నారు. ప్రజల సంక్షేమమే శ్వాసగా పయనిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని 2024 తిరిగి సీఎం చేసుకోవాలని ప్రజలు కంకణం కట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నిమ్మకాలయ సుధాకర్‌రెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, హిదాయత్, చెన్న కేశవరెడ్డి, అల్లె రాజారెడ్డి, మునిరెడ్డి, నిఖిల్‌రెడ్డి, పీవీ కృష్ణారెడ్డి, దేవదానం, జగన్‌మోహన్‌రెడ్డి, రెడ్డి కరీం, లక్ష్మీ నారాయణరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, మర్రి సుబ్బన్న, మోనార్క్ తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ స్థాపించి 12 ఎళ్లు పూర్తి చేసుకుని 13వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా పట్టణంలోని బాకరాపురంలో వైఎస్సార్ ఆడిటోరియంలో వైఎస్సార్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఇన్‌చార్జ్ వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాదులు జెండా ఎగుర వేసి మాట్లాడారు. రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు. రాష్ట్రం లోటుబడ్జెట్‌లో ఉన్నప్పటికీ రాష్ట్రాన్ని అన్ని విదాల అభివృద్ధి చేస్తు ప్రజలకు చెప్పిన విధంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులకు పండ్లు బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సివిల్ సప్లై డైరెక్టర్ గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, వైస్ చైర్మన్, హఫీజ్, ఆలయాల చైర్మన్లు సుధీకరరెడ్డి, ప్రసాదు, వైఎస్సార్ సీపీ మండల పరిశీలకుడు బలరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు, రసూల్, వెంకటసుబ్బయ్య, రఫీ, చంద్రమౌళి, సంపత్, కౌన్సిలర్లు, కిషోర్, కోడిరమణ, మహేశ్వరరెడ్డి, భార్గవి, కృష్ణమూర్తి, నరసారెడ్డి, డేనియల్, రాజేష్ నాయుడు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు : వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కోడిగాండ్లపల్లె సమీపంలోని ఏసుకరుణాలయ అనాథాశ్రమంలో అనాథలకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, పార్టీ నాయకులు రామచంద్రుడు, రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణయాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, పక్కీరప్ప, సాంబశివారెడ్డి, గుర్రప్ప, రమేష్ పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె : స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించి పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యకర్తలకు మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, సివిల్‌సప్లై డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : స్థానిక పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డి, మండల పార్టీ ఇన్‌చార్జి ఎం. సురేంద్రనాథ్‌రెడ్డిల సమక్షంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండాను ఎగుర వేసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ముఖ్యమంతి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి ఘనంగా నివాలర్పించారు. కార్యక్రమంలో మండలం, పట్టణ పరిధిలోని పార్టీనాయకులు కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కమలాపురంలో సీఎం వైఎస్ జగన్ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం



ఎర్రగుంట్లలో పార్టీ జెండా ఎగురు వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం .సుధీర్‌రెడ్డి, తదితరులు



వీఎన్‌పల్లెలో పార్టీ కార్యాలయం వద్ద జెండాను ఎగురవేస్తున్న నాయకులు



ముద్దనూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



హాజరైన తల్లిదండ్రులు, ప్రజలు



మాట్లాడుతున్న ముఫ్తి అహ్మదుల్లా నిసార్ ఖాస్మి

కమలాపురం : ప్రతి ముస్లిం మహమ్మద్ ప్రవక్త (సా.అ.) జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని హైదరాబాద్‌కు చెందిన మౌలానా ముఫ్తి అహ్మదుల్లా నిసార్ ఖాస్మి తెలిపారు. స్థానిక ముస్లిం కమ్యూనిటీ షాదిఖానాలో నిర్వహించిన తన్‌జిముల్ మకాతిబ్ కమలాపురం కే జేరే ఎహ్‌తిమామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ముస్లిం మహ్మద్ ప్రవక్త జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవనం సాగించాలన్నారు. చాలా మంది పిల్లలు దీన్‌కు దూరంగా ఉంటున్నారని, కమలాపురంలో మదరసాలు ఏర్పాటు చేసి దీన్ గురించి వివరించడం సంతోషకరమన్నారు. సెల్‌ఫోన్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలన్నారు. వాటి వల్ల చెడు వ్యసనాలకు బానిస అవుతున్నారన్నారు. బద్వేల్‌కు చెందిన మౌలానా ముఫ్తి అబ్దుల్ హాది సాహెబ్, అనంతపురంకు చెందిన ముఫ్తి సైపుల్లా ముజాహిరి ప్రసంగించారు. అనంతరం సమావేశానికి వచ్చిన ప్రజలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని మదరసాల గురువులు, విద్యార్థులు,తల్లి దండ్రులు పాల్గొన్నారు.

ఘన జీవామృతంతో చీడపీడల నివారణ

లక్కిరెడ్డిపల్లి : ఘన జీవామృతంతో మామిడిలో చీడపీడల నివారించుకోవచ్చని ప్రకృతి వ్యవసాయ అధికారిణి సరస్వతి పేర్కొన్నారు. ఆదివారం దప్పేపల్లి పంచాయతీలోని కొండవాండ్లపల్లెలో 14 ఎకరాల మామిడి తోటకు ఘనజీవామృతం తయారు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, జీవామృతం మామిడిలో చీడపీడలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మామిడిలో పూత, పిందె రాల కుండా కాయ వస్తుందని ఆమె తెలియజేశారు. రైతు సోమశేఖర్ రెడ్డి 14 ఎకరాలలో కషాయాలు ఉపయోగిస్తున్నారని ఆమె తెలిపారు. ఘనజీవామృతం 22 టన్నులు, ద్రవ జీవామృతం 15 వేల లీటర్లు తయారు చేసి మామిడి తోటలకు పిచికారీ చేస్తున్నామని ఆమె తెలిపారు. ప్రతి రైతు తమకు అందుబాటులో ఉండే ఆకులు ద్వారా ప్రకృతి ఎరువులు తయారు చేసుకొని పొలాలకు వాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు అంజనమ్మ, చంద్రకళ, రైతులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శాస్త్రీయ నృత్యప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పులివెందుల శిల్పారామంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో రాజా కళానిలయం చిన్నారులచే రాజా డ్యాన్స్ మాస్టర్ తమ చిన్నారులతో జానపదం, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల అధికారులు



జమ్మలమడుగులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు



వల్లూరు పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ వాసుదేవన్



పులివెందులలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున ఎన్నికల అధికారులు

పులివెందుల టౌన్ : పచ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సోమవారం జరిగే ఎన్నికలకు అధికారులు పోలింగ్ ఏర్పాట్లు పూర్తి చేశారు. పులివెందుల మండలానికి సంబంధించి 7 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా అందులో పట్టభద్రులకు 6, ఉపాధ్యాయులకు 1 చొప్పున ఏర్పాటు చేశారు. వాటిలో పాత సత్రంబడి పాఠశాలలో ఉపాధ్యాయులకు ఒకటి ఏర్పాటు చేయగా..పట్టభద్రులకు రెండు ఏర్పాటు చేశారు. అలాగే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రెండు, అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రెండు పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. మండల పరిధిలో 4463 మంది పట్టభద్రులు కాగా 561మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పులివెందుల రెవెన్యూ డివిజన్ పరిధిలో 12,401 మంది పట్టభద్రులు, 993 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

పులివెందుల రూరల్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసి ఓటర్లకు పోలింగ్‌బూత్ వివరాలను తెలియజేస్తూ స్లిప్పులను అందజేశారు. నియోజకవర్గంలో పట్టభద్రులకు 14, ఉపాధ్యాయులకు 8 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద డీఎస్పీ ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు.

వేముల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు పోలింగ్ బూతులను సిద్ధం చేశారు. మండల వ్యాప్తంగా 1060 మంది పట్టభద్రులు, 37 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

జమ్మలమడుగు : పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అధికారులు సర్వం సిద్ధం చేశారు. నియోజకవర్గంలో మొత్తం 10,477 మంది పట్టభద్రులు ఓటర్లు ఉండగా, 934 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవలసి ఉంది. అయితే గతంలో జరిగిన ఎన్నికలతో పోల్చితే ఈ ఏడాది జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ఓటింగ్‌శాతం పెంచుకోవటానికి రాజకీయ పార్టీ నాయకులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీగా వెన్నపూస రవీంద్రారెడ్డి, టీడీపీ తరపునుంచి రామగోపాల్‌రెడ్డి, పీడీఎఫ్ తరపునుంచి పోతుల నాగరాజు అభ్యర్థులుగా బరిలో నిలబడ్డారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి వైఎస్సార్‌సీపీ తరపు నుంచి ఎం.వి.రామచంద్రారెడ్డి, ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న కత్తి నరసింహారెడ్డి, రూపాయి డాక్టర్‌గా పేరుపొందిన అనిల్ వెంకటప్రసాద్‌రెడ్డిలు బరిలో ఉన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆర్డీఓ... పట్టణంలో పతంగే రామన్నరావు ఉన్నతపాఠశాలలోని 4 పట్టభద్రులు, ఒక ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ జి.శ్రీనివాసులు పరిశీలించి మాట్లాడారు. డివిజన్ పరిధిలో 30 పట్టభద్రుల, 10 ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వేంపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే బూత్‌లను ఆదివారం వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ తిరుపాల్ నాయక్‌లు పరిశీలించి మాట్లాడారు.స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మూడు బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా పట్టభద్రులు ఓట్లు 2100 మంది, ఉపాధ్యాయుల ఓట్లు 165 మంది ఉన్నారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందో బస్తు ఏర్పాటు చేశామన్నారు.

సింహాద్రిపురం : ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండల కేంద్రంలోని పలు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను ఆదివారం ఆర్డీఓ వెంకటేశ్వర్లు పరిశీలించి మాట్లాడారు. హైస్కూల్‌లో పట్టభద్రులకు ఒక పోలింగ్ బూత్, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి ఒక పోలింగ్ బూత్ ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా పట్టభద్రుల ఓట్లు 1109, ఉపాధ్యాయుల ఓట్లు 46 ఉన్నాయన్నారు. ఓటర్లు ప్రశాతంగా ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు.

లింగాల : మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల పోలింగ్ బూత్‌లో పీఓగా శంకర్, ఉపాధ్యాయులు పోలింగ్ కేంద్రంలో పీఓగా శివనాయక్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. 833 మంది పట్ట భద్రులు, 33 మంది ఉపాధ్యాయుల ఓట్లు ఉన్నట్లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఆర్డీఓ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్ఐ రుషికేశవరెడ్డి తెలిపారు.

చక్రాయపేట : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం మండలంలోని నాగలగుట్టపల్లె జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాట్లను పూర్తి చేశామని తహసీల్దారు రాజ సింహ నరేంద్ర తెలిపారు. సోమవారం ఈపోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీకి సంబంధించి 1031 మంది, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సంబంధించి 36 మంది ఓటుహక్కును వినియోగించు కోనున్నట్లు ఆయన తెలిపారు.

వల్లూరు : కమలాపురం నియోజకవర్గంలో సోమవారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంభందించి అధికారులు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు పూర్తి చేశారు. నియోజకవర్గంలో మొత్తం ఆరు మండలాలు వుండగా పట్టభద్రుల ఓటర్లు మొత్తం 7225 మంది వున్నారు. ఇందులో 4736 మంది పురుషులు, 2489 మంది మహిళా ఓటర్లు వున్నారు. ఇందుకు గానూ చింతకొమ్మదిన్నె, కమలాపురం మండలాల్లో రెండు పోలింగ్ కేంద్రాల చొప్పున, వల్లూరు, చెన్నూరు, పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గం మొత్తం 341 ఉపాధ్యాయ ఓట్లు వుండగా అందులో 205 మంది పురుషులు, 136 మంది మహిళా ఉపాధ్యాయ ఓటర్లు వున్నారు. ఇందుకు గానూ మండలానికి ఒకటి చొప్పున ఆరు మండలాల్లో ఆరు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

వల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల మరియు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ వాసుదేవన్ పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి, చేపట్టాల్సిన చర్యలను గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కట్టుదిట్టంగా బందోబస్తును ఏర్పాటు చేయాలని ఎస్ఐ విష్ణువర్ధన్‌ను ఆదేశించారు.

ఓటమి భయంతోనే టీడీపీ అసత్యప్రచారం

ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి



జమ్మలమడుగులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ నామరూపాలు లేకుండపోతుందనే భయంతోనే వైఎస్సార్‌సీపీపై అసత్యప్రచారం చేస్తోందని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టి మాట్లాడారు. టీడీపీని ప్రజలు మరచిపోయే రోజులు వస్తున్నాయని ప్రజలు ఇప్పటికే అన్ని ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి పట్టంకట్టారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి అన్నివర్గాల ప్రజలు మద్దతు పలుకుతుండటంతో టీడీపీ ఎక్కడ కనిపించకుండపోతుందనే భయంతో నాయకులు వైఎస్సార్‌సీపీ డబ్బులు పంపిణీ చేస్తుందంటూ ప్రజల్లో అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసే కార్యక్రమాలకు భవిష్యత్తులో జరిగే ప్రతి ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకి మరింత మెజార్టీతో అధికారం ఇవ్వబోతున్నారన్నారు. అనంతరం కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఏకగ్రీవమైన పి.రామసుబ్బారెడ్డిని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శివారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గిరిధర్ రెడ్డి, నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మండలాల వారీగా గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల వివరాలు ఇలా వున్నాయి.

మండలం	గ్రాడ్యుయేట్ ఓటర్లు			పోలింగ్ కేంద్రాలు	ఉపాధ్యాయ ఓటర్లు			పోలింగ్ కేంద్రాలు
	పురుషులు	స్త్రీలు	మొత్తం		పురుషులు	స్త్రీలు	మొత్తం	
కమలాపురం	944	587	1531	2	28	31	59	1
వల్లూరు	528	222	750	1	19	2	21	1
చెన్నూరు	731	370	1101	1	44	23	67	1
సీకే దిన్నె	1136	662	1798	2	68	53	121	1
పెండ్లిమర్రి	820	348	1168	1	18	10	28	1
వీఎన్ పల్లె	577	300	877	1	28	17	45	1
మొత్తం	4736	2489	7225	8	205	136	341	6